


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)

Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 269 | సోమవారం 27- అక్టోబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695




## కేసీఆర్ సెక్యులర్ లీడర్ అనడానికి ఇదే నిదర్శనం



**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ అంతర్జాతీయ ఖ్యాతి పొందిందని.. 2014 నుంచి పదేళ్లలో హైదరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. షేక్ పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి తరుపున ప్రచారంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. 2014 కంటే ముందు ప్రతి అపార్ట్మెంట్ ముందు జనరేటర్లు ఉండేవి బీఆర్ఎస్ వచ్చిన తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం ద్వారా జనరేటర్లు మాయమయ్యాయన్నారు. గంగా జమున తహసీబ్ సంస్కృతి ఉన్న ఇక్కడ ఎప్పుడు మతకల్లోలాలు జరగలేదని.. పదేళ్ల పాలనలో అందరూ ప్రశాంతంగా జీవించారన్నారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు, క్రిస్టమస్ గిఫ్ట్ లు అందించామని తెలిపారు.. కేసీఆర్ ఓ హిందూ.. ఆయన ఎన్నో యాగాలు చేశారు. అయినా ప్రతి మతాన్ని గౌరవించారన్నారు. కొత్త సచివాలయం నిర్మించినప్పుడు అక్కడ ఒక మజీద్, ఒక చర్చి, ఒక దేవాలయం నిర్మించారని చెప్పారు. కేసీఆర్ సెక్యులర్ లీడర్ అనేదానికి ఇది ఒక నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలో ఒకసారి ఆలోచించాలన్నారు.

## త్వరలో ఆ బీజేపీ ఎంపీ చిట్టా బయటపెడతా.. కవిత సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ తనను ఏకపక్షంగా బయటకు పంపించిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నేనెప్పుడు పార్టీ నుంచి బయటకు రావాలనుకోలేదని అందుకోసమే ఎన్నడు కూడా నా బాధను బయట పెట్టలేదన్నారు. కానీ అనివార్య పరిస్థితుల్లో నా బాధను బయట పెడితే నన్ను పార్టీ నుంచి బయటకు పంపిచేశారని దాంతో బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి జనం ముందుకు వచ్చానన్నారు. జాగృతి జనం బాట యాత్ర సందర్భంగా ఇవాళ నిజామాబాద్?లో మీడియాతో మాట్లాడిన కవిత.. బీఆర్ఎస్ తో తనది స్ట్రెయిట్ ఫైటింగ్ అని, నన్ను పార్టీ నుంచి బయటకు పంపించి నన్ను సీఎం చేయాలనేది కేసీఆర్ ప్రణాళిక కాదన్నారు. కేసీఆర్ చుట్టూ ఉన్న ద్రోహులు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించారని, సమీక్షలు జరిగి ఉంటే బీఆర్ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయేది కాదన్నారు

ఆ ఎంపీ చిట్టా బయట పెడతా:

బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఉన్నా లేనట్టేనని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో నిజామాబాద్?లో 'కే' ట్యాక్స్ నడుస్తుందని అర్వింద్ ఆరోపించారు.

## కడుపునొప్పితో ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే.. చేతికి ఇన్ ఫెక్షన్..



## అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని చెత్తబుట్టలో పడేస్తాం: తేజస్వి యాదవ్



**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మహా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ కీలక ప్రకటన చేశారు. ఆదివారం ఆయన ముస్లింలు అధికంగా నివసించే కతిహార్, కిషన్‌గంజ్ ప్రాంతాలలో జరిగిన బహిరంగ సభలలో మాట్లాడుతూ.. ఒక ప్రధాన రాజకీయ ప్రకటన చేశారు. బీహార్‌లో అఖిల భారత కూటమి ప్రభుత్వాన్ని ఏర్పడిన తర్వాత, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ (సవరణ) చట్టాన్ని చెత్తబుట్టలో పడేస్తామని చెప్పారు.

తేజస్వి మాట్లాడుతూ, "నా తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఎప్పుడూ మతతత్వ శక్తులతో రాజీపడలేదు.

## ప్రమాదాలపై టీజీఎస్ఆర్టీసీ అలర్ట్.. బస్సుల్లో సైరన్, సేఫ్టీ ప్రికాషన్స్..



**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** కర్నూలులో ఇటీవల జరిగిన కావేరి బస్సు ప్రమాద ఘటనతో టీజీఎస్ఆర్టీసీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ప్రయాణికుల భద్రతకు చర్యలు చేపట్టినట్లు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ వారి ముఖ్య గమనిక అంటూ ఆదివారం ఎక్స్ వేదికగా కీలక వివరాలు ప్రకటించింది. టీజీఎస్ఆర్టీసీ వివిధ రకాల బస్సుల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తోందని, ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా వివిధ రకాల బస్సులలో సేఫ్టీ ప్రికాషన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపింది. లహరి ఏసీ స్లీపర్, లహరి ఏసీ స్లీపర్ కం సీటర్, రాజధాని ఏసీ బస్సులలో వెనుక భాగంలో అత్యవసర ద్వారంను ఏదైనా కిటికీ అద్దాలు పగలగొట్టేందుకు సుత్తెలు, మంటలు ఆర్పులకు ఫైర్ ఎక్స్టింగిషెర్, ప్రధానంగా డ్రైవర్ క్యాబిన్ నందు మంటలను ఆర్పుటకు ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్, మంటలను ఆర్పే పరికరాలు అమర్చబడ్డాయని పేర్కొంది.

స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఈసీ..

## బీఆర్ఎస్‌కి బిగ్ షాక్..




# ఉద్యోగులు 'ఔట్..'!

## లక్షల మంది జీతాలు ఆపేస్తూ సర్కార్ సంచలన నిర్ణయం

- ఆదేశాలను పట్టించుకోని శాఖలు
- సగం మంది నకిలీలేనా?
- ఆధార్ లింక్ తప్పనిసరి
- దొరికిపోతామనే భయం అధికారుల్లో
- జీతాల దోపిడీ బహిర్గతమవుతుందా?
- ఆర్థిక శాఖ కఠినంగా హెచ్చరిక

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, కార్పొరేషన్లు, యూనివర్సిటీల్లోని హెచ్ఓడీలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయీస్ వివరాలు ఇవ్వాలని, లేకపోతే వారికి వేతనాలు చెల్లించబోమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. శనివారం రాత్రి వరకు కేవలం 55% మంది వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. మిగతా 45% మంది ఉద్యోగులు అసలు పనిచేస్తున్నారా? లేదా? అనే చర్చ జరుగుతున్నది. ఇంతకాలం సదరు ఎంప్లాయీస్ వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, ఆ జీతాలను అధికారులు, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు వాటాలుగా పంచుకున్నట్టు అనుమానం మొదలైంది. అందుకే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వివరాలు ఇవ్వలేదని ప్రచారం జరుగుతున్నది.

సగం మంది నకిలీలే?

వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 4,93,820 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో 2,74,844 మంది ఉద్యోగుల వివరాలు మాత్రమే ప్రభుత్వం వద్ద ఉన్నాయి. మిగతా 2,18,976 మంది వివరాలు లేవు. దీంతో ఈ నెల 17న అన్ని శాఖలకు ఆర్థిక శాఖ సర్క్యులర్ పంపింది. ప్రతి ఉద్యోగి ఆధార్ నంబరు, బ్యాంకు అకౌంట్ వివరాలను ఐఎఫ్ఎమ్ఐఎస్ పోర్టల్‌లో అక్టోబర్ 25వ తేదీలోపు నమోదు చేయాలని ఆదేశించింది. లేదంటే వచ్చేనెల నుంచి వారికి జీతాలు చెల్లించబోమని స్పష్టం చేసింది. కానీ, శనివారం రాత్రి వరకు సుమారు లక్ష మంది ఎంప్లాయీస్ వివరాలు మాత్రమే నమోదైనట్టు అధికారులు గుర్తించారు. మిగతా లక్షమంది వివరాలు మాత్రం నమోదు చేయలేదు. దీంతో వారంతా నకిలీలే అనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతున్నది. ఆధార్ లింక్ లేకపోవడంతోనే కొందరు అధికారులు ఇన్నాళ్లు ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. రికార్డుల్లో తమకు ఇష్టం ఉన్న వ్యక్తుల పేర్లు రాసుకుని జీతాలు చెల్లించగా, కొందరైతే ఒకే వ్యక్తి పేరుతో నాలుగైదు శాఖల్లో వేతనాలు డ్రా చేశారని ఆరోపణలున్నాయి.



## ఆ పట్టణానికి సీఎం స్పెషల్ గిఫ్ట్..

**అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు మంజూరు..!**



## రాష్ట్రమంతా తిరిగినా కవితకు 400 ఓట్లు రావు

**- ఎంపీ అర్వింద్**



## జూబ్లీహిల్స్‌లో మా విజయం ఖరారైంది

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



## బీఆర్ఎస్‌కు షాక్..

**భారీగా తగ్గిన పార్టీ ఫండింగ్**

**97.40% పడిపోయిన రాజకీయ విరాళాలు**

**రూ.580.52 కోట్ల నుంచి రూ.15 కోట్లకు పరిమితం**



## పత్తి రైతులకు గుడ్‌న్యూస్

**తేమ శాతం 12 కంటే ఎక్కువ ఉన్నా కొనుగోళ్లు**

**మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు**



## ముంచుకొస్తున్న 'మొంథా' తుపాను

### తెలంగాణకు భారీ వర్ష సూచన

- ఈనెల 28,29న తెలంగాణకు భారీ వర్ష సూచన
- వాతావరణశాఖ హెచ్చరికలు జారీ



## బీఆర్ఎస్‌కు షాక్.. భారీగా తగ్గిన పార్టీ ఫండింగ్

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి రాజకీయ విరాళాల రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పార్టీకి అందిన విరాళాలు గతంతో పోలిస్తే ఏకంగా 97.40 శాతం పడిపోయాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన వార్షిక నివేదికలో ఈ వివరాలు వెల్లడించారు. బీఆర్ఎస్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.15,09,08,141 (రూ. 15.09 కోట్లు) మాత్రమే విరాళాలుగా అందాయి. ఈ నిధులలో ఎక్కువ భాగం ట్రస్టుల ద్వారానే సమకూరాయి. ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.10 కోట్లు, ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.5 కోట్లు విరాళాలుగా వచ్చాయి. వ్యక్తిగత విరాళాలు చాలా తక్కువగా నమోదయ్యాయి. ఎస్.రాజేందర్‌రెడ్డి రూ.8.79 లక్షలు, మహమ్మద్ అజార్ రూ.29 వేలు మాత్రమే పార్టీకి అందించారు.

గత రెండేళ్లతో పోలిస్తే దారుణమైన పతనం

విరాళాల రూపంలో వచ్చిన ఈ స్వల్ప మొత్తం, గత రెండేళ్ల ఆర్థిక సంవత్సరాల గణాంకాలతో పోలిస్తే పార్టీకి తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టం చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్‌కు మొత్తం రూ.580.52 కోట్లు విరాళాలుగా వచ్చాయి. ఇందులో ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే రూ.495.52 కోట్లు దక్కాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి అదనంగా రూ.85 కోట్లు వచ్చాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పార్టీ అత్యధికంగా రూ.683.06 కోట్ల విరాళాలు పొందింది. అందులో ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.529 కోట్లు, ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.90 కోట్లు, వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి రూ.64.03 కోట్లు వచ్చాయి. ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల వ్యవస్థ రద్దు కావడం, అలాగే 2023 నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ అధికారం కోల్పోవడం వంటి కారణాల వల్లనే విరాళాలు ఇంత భారీగా పడిపోయినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ నాయకత్వం, కార్యకర్తలు తీవ్ర నిరాశలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఈ గణాంకాలు బీఆర్ఎస్‌కు మరింత ఇబ్బందికరంగా మారాయి. విరాళాల తగ్గుదల పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణ వ్యయాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# పత్తి రైతులకు గుడ్‌న్యూస్..

### తేమ శాతం 12 కంటే ఎక్కువ ఉన్నా కొనుగోళ్లు
### మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ పత్తి రైతులకు గుడ్‌న్యూస్. వర్షాల కారణంగా తడిసి ఇబ్బందులు పడుతున్న పత్తి రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలు జారీ చేశారు. శనివారం సచివాలయంలో వివిధ పంటల కొనుగోళ్లపై ఉన్నతాధికారులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పత్తి కొనుగోళ్లపై కీలక నిర్ణయాలు తీసుకున్న మంత్రి.. సాధారణంగా పత్తిలో తేమ శాతం 8-12 శాతం వరకు ఉండాలనే నిబంధనను సడలించాలని సీసీఐ అధికారులకు సూచించారు.

వర్షాల నేపథ్యంలో తడిసిన పత్తిని రైతులు ఆరబెడుతున్నా తేమ శాతం తగ్గడం లేదని.. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉన్నా కూడా మద్దతు ధరలతో కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. రైతులు దళారుల వద్దకు వెళ్లి మోసపోకుండా, కేవలం సీసీఐ కొనుగోలు కేంద్రాలలోనే పత్తి అమ్మకాలు జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పత్తిలో తేమ శాతంపై, అలాగే కొనుగోలు ప్రక్రియలో ఉన్న 'ఎల్1, ఎల్2 మ్యాపింగ్' విధానంపైనా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలి. ఈ-నామ్ (e-NAM) సర్వర్‌లో ఏర్పడుతున్న సమస్యతో కొన్ని జిల్లాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు.

కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలకు నియమించిన నోడల్ అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని మంత్రి నిర్దేశించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అవుతున్న మొక్కజొన్నను నిరోధించాలని మార్కెటింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక రైతులు నష్టపోకుండా అక్రమ రవాణాను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. మొత్తంగా, రైతులు నష్టపోకుండా ప్రతి గింజకూ మద్దతు ధర దక్కేలా, కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇక పత్తి కొనుగోళ్ల తర్వాత మూడ్రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముంచుకొస్తున్న 'మొంథా' తుపాను ముప్పు..
## తెలంగాణకు భారీ వర్ష సూచన

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ మరోసారి భారీ వర్షం హెచ్చరికలు జారీ చేసింది. 'మొంథా' తుపాను ఆంధ్రా తీరం వైపు వేగంగా దూసుకొస్తోందని.. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం శనివారం ఉదయం వాయుగుండంగా మారిందని చెప్పారు. వాతావరణశాఖ అంచనాల ప్రకారం.. ఈ వాయుగుండం ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా, సోమవారం ఉదయానికి పూర్తిస్థాయి తుపానుగా మారే అవకాశం ఉందన్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత లేదా మంగళవారం తెల్లవారుజామున ఇది తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా అక్టోబర్ 28న సాయంత్రం వేళ కాకినాడ సమీపంలో ఈ 'మొంథా' తుపాను తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీని ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ముఖ్యంగా అక్టోబర్ 28, 29 తేదీల్లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నేటి నుంచి ఐదు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచన ఉందన్నారు. ఈ జిల్లాలతో పాటు మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30- 40 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని సూచించారు. రాజధాని హైదరాబాద్ నగరంలో కూడా వర్షాలకు అవకాశం ఉందని చెప్పారు.

ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత భవనాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అక్టోబర్ 30 తర్వాత వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అప్పటి వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు.

## రాష్ట్రమంతా తిరిగినా కవితకు 400 ఓట్లు రావు : ఎంపీ అర్వింద్

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రమంతా తిరిగినా కల్వకుంట్ల కవితకు 400 ఓట్లు కూడా రావని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. 'జాగృతి జనం బాట' జిల్లాల పర్యటన సందర్భంగా కవిత చేసిన వ్యాఖ్యలపై అర్వింద్ స్పందించారు. తాజాగా ఓ న్యూస్ చానల్?తో మాట్లాడిన అర్వింద్.. బీఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులకు ఎందుకు న్యాయం చేయలేదో ఫామ్ హౌస్ కు వెళ్లి కేసీఆర్ ను కవిత అడగాలన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవిత అక్రమంగా సంపాదించిన కోట్లాది రూపాయలు తీసుకువచ్చి అమరవీరుల కుటుంబాలకు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. నాలుగు సంవత్సరాలు కాదు కదా నాలుగు జన్మలెత్తినా ప్రజలు కవితకు ఓట్లు వేయరన్నారు. కేసీఆర్ ఫోటో లేకుండా కవితను ఎవరూ పట్టించుకోరని, కేసీఆర్ ఫోటోతోనే కవిత తన జీవితంలో ఒక్క సారి ఎంపీ అయ్యారని విమర్శించారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ పరిస్థితిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని అడగాలన్నారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్ని బీజేపీ ఎన్ని స్థానాలు గెలవబోతోంది అనేది చెప్పగలను కానీ జూబ్లీహిల్స్ నేనెట్లా చెప్పగలనన్నారు.

# ఆ పట్టణానికి సీఎం స్పెషల్ గిఫ్ట్..

## అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు మంజూరు..!

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీలక అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల ప్రత్యేక నిధులు ( స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ) మంజూరు చేసింది. ఈ నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఈ ప్రత్యేక నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మునిసిపల్ శాఖ తన ఆదేశాలలో స్పష్టం చేసింది. ఈ చారిత్రక నగరంలో మౌలిక వసతులను మెరుగుపరచడానికి, ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

ముఖ్యంగా, వర్షాకాలంలో వరంగల్ నగరంలో తీవ్ర సమస్యగా మారుతున్న వరద ముంపు నివారణ పనులకు ఈ రూ.50 కోట్ల నిధులు ప్రధానంగా కేటాయించారు. ఈ నిధులతో వరంగల్‌లోని పోతననగర్, హనుమకొండలోని నయీంనగర్ ప్రాంతాలలో వరదనీటి కాలువల నిర్మాణం పనులు పూర్తి చేయనున్నారు. వీటితో పాటు, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ల ఆదేశాల మేరకు.. హంటర్‌రోడ్‌లోని 12 మోరీల పనులు, ఉర్సు డీకేనగర్, శివనగర్, దేశాయిపేట, చిన్నవడ్డేపల్లి వంటి వరద ముంపు ప్రాంతాలు, అలాగే హనుమకొండలోని సమ్మయ్యనగర్, రామకృష్ణ కాలనీ, తిరుమల బార్ సెంటర్ వంటి ప్రాంతాలలో చేపట్టాల్సిన అత్యవసర అభివృద్ధి పనుల కోసం ఇంజినీర్లు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు.

ఈ ప్రత్యేక నిధులు విడుదల చేయడం పట్ల మేయర్ గుండు సుధారాణి వరంగల్ నగర ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నగర అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రికి ఉన్న నిబద్ధతను ఈ నిధుల విడుదల తెలియజేస్తుందని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా.. నిధుల విడుదలకు సహకారం అందించిన ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా మంత్రులు సురేఖ, సీతక్క, స్థానిక ఎమ్మెల్యేలకు కూడా మేయర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకొని, వరంగల్ ప్రజల ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వరంగల్ మేయర్, కమిషనర్ స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్‌లో మా విజయం ఖరారైంది..
## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలకు నమ్మే పరిస్థితి లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన జూబీహిల్స్ నియోజకవర్గ పరిధిలో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా లోకల్ కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ దోపిడీని భరించలేకపోయారని కమామెంట్ చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి అధికారన్ని కట్టబెట్టారని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో కూడా తమ అభ్యర్థి గెలుపు ఖాయమని అన్నారు. ఇటీవల జరిగిన కంటోన్మెంట్ లో బై ఎలక్షన్‌లో సెంటిమెంట్ పని చేయలేదని గుర్తు చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ మా అభ్యర్థి గురించి మాట్లాడాడంటే మా విజయం అప్పుడే ఖాయమైదని అన్నారు. నిజంగా నవీన్ యాదవ్ రౌడీ అయితే పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్ని కేసులు ఉన్నాయో బీఆర్ఎస్ నేతలు బయట పెట్టాలని సవాలు విసిరారు. జూబ్లీహిల్స్ అంటే క్లాస్ పీపుల్ అని అందరూ అనుకుంటారని.. ఇందంతా మాస్ ఏరియా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

## కడుపునొప్పితో ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే.. చేతికి ఇన్ ఫెక్షన్.. యువకుడి పరిస్థితి విషమం..

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** కడుపునొప్పితో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చేతికి ఇన్ ఫెక్షన్ తో ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు ఓ యువకుడు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణం అంటున్నాడు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాస్పత్రికి వెళ్లిన బాధితుడి దయనీయ గాథ ఇది.. సంగమేశ్వర(33) అనే యువకుడు ఈ ఏడాది జూలై 23న రాత్రి 8 గంటలకు కడుపునొప్పితో ఆస్పత్రికి వెళ్లాడు. ఇంజెక్షన్స్, సెలైన్లు పెట్టడంతో తన చేయి ఎర్రగా వాచింది. డ్యూటీలో ఉన్న డాక్టర్ ని అడిగితే ఐస్ పెట్టుకోమంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్ళాక చేయి మరింత వాచింది. సంగారెడ్డిలో ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లగా చేతికి ఇన్ఫెక్షన్ సోకిందని డాక్టర్లు చెప్పారు.

తల్లిదండ్రులు వెంటనే హైదరాబాద్ కిమ్స్ కి సంగమేశ్వర్ ని తీసుకెళ్లారు. చేతికి ఇన్ ఫెక్షన్ సోకిందని చేయి తొలగించాలని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళనకి గురయ్యారు. అక్కడి నుంచి యశోదా ఆస్పత్రికి తరలించారు. చేతికి ఇన్ ఫెక్షన్ తొలగించడానికి రూ. 35 లక్షలు ఖర్చు చేశారు. చికిత్స కోసం ఉన్న ఇల్లును అమ్మారని బాధితుడు బోరున విలపిస్తున్నాడు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్యూటీ డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ కి ఫిర్యాదు చేశాడు. చేతికి ఇన్ ఫెక్షన్ అయితే నువ్వు బతకవు కదా.. అంటూ సూపరింటెండెంట్ సమాధానం ఇచ్చారని చెబుతున్నాడు.

# ఉద్యోగులు 'ఔట్..'!

## లక్షల మంది జీతాలు ఆపేస్తూ సర్కార్ సంచలన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

దొరికిపోతామని భయం

ఇంతకాలం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్‌కు జీతాల చెల్లింపుల్లో ఆడిటింగ్ లేదు. సర్కార్ మానిటరింగ్ లేకపోవడంతో ఎవరికి ఇష్టం వచ్చినట్టు వాళ్లు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకోవడం, వారికి జీతాలు చెల్లించడం సాగింది. పనిచేయకున్నా చేస్తున్నట్టు రికార్డుల్లో నమోదు చేసి, ఆ జీతాలను అధికారులు, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు వాటాలుగా పంచుకున్నట్టు సర్కారుకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఎంప్లాయీస్ వివరాలను ఆధార్ లింక్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో అధికారుల్లో భయం మొదలైంది. దీంతో కేవలం పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు మాత్రమే అప్‌లోడ్ చేశారు. ఇంతకాలం పనిచేయని వారికి, నకిలీలకు జీతాలు చెల్లించి.. ఇప్పుడు వివరాలు నమోదు చేస్తే దొరికిపోతామనే భయంతో వారి వివరాలను నమోదు చేయకుండా అధికారులు మౌనంగా ఉన్నట్టు తెలుస్తున్నది.

జీతాలు వెనక్కి తీసుకుంటారా?

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నట్టు గత ఐదారేండ్లుగా రికార్డుల్లో ఎంప్లాయీస్ వివరాలు సృష్టించి, శాలరీలు కొల్లగొట్టిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే భయం ఆఫీసర్లను వెంటాడుతున్నది. ఇన్నాళ్లు పనిచేయకున్నా చేసినట్టు చూయించి తీసుకున్న శాలరీలను వారి నుంచి ప్రభుత్వం తీసుకుంటుందనే చర్చ జరుగుతున్నది. అయితే ఇప్పటి వరకు నమోదైన ఎంప్లాయీస్ వివరాలను 360 డిగ్రీల్లో స్క్రూటినింగ్ చేసి, అందులో ఎవరైనా నకిలీలు ఉంటే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్టు తెలిసింది.

ఆధార్ లింక్ చేయని వారికి జీతాలు ఇవ్వొద్దు.. సర్క్యులర్ జారీ చేసిన ఆర్థిక శాఖ

ఐఎఫ్ఎమ్ఐఎస్ పోర్టల్‌లో ఆధార్ లింక్ చేయని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అక్టోబర్ జీతం చెల్లించొద్దని ఆర్థిక శాఖ అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. లింకింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సదరు ఎంప్లాయీస్‌కు జీతాలు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఆధార్ లింక్ చేసిన ఎంప్లాయీస్‌కు యథావిధిగా జీతాలు చెల్లించాలని పేర్కొంది. కొన్ని శాఖలు తమ వద్ద ఉన్న హెడ్ ఆఫ్ అకౌంట్స్ నుంచి ఆధార్ లింక్ చేయని ఎంప్లాయీస్‌కు జీతాలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఇష్టానుసారంగా జీతాలు చెల్లిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

## కేసీఆర్ సెక్యులర్ లీడర్ అనడానికి ఇదే నిదర్శనం

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ అంతర్జాతీయ ఖ్యాతి పొందిందని.. 2014 నుంచి పదేళ్లలో హైదరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. షేక్ పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి తరుపున ప్రచారంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. 2014 కంటే ముందు ప్రతి అపార్ట్మెంట్ ముందు జనరేటర్లు ఉండేవి బీఆర్ఎస్ వచ్చిన తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం ద్వారా జనరేటర్లు మాయమయ్యాయన్నారు. గంగా జమున తహసీబ్ సంస్కృతి ఉన్న ఇక్కడ ఎప్పుడు మతకల్లోలాలు జరగలేదని.. పదేళ్ల పాలనలో అందరూ ప్రశాంతంగా జీవించారన్నారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు, క్రిస్టమస్ గిఫ్ట్ లు అందించామని తెలిపారు.. కేసీఆర్ ఓ హిందూ.. ఆయన ఎన్నో యాగాలు చేశారు. అయినా ప్రతి మతాన్ని గౌరవించారన్నారు. కొత్త సచివాలయం నిర్మించినప్పుడు అక్కడ ఒక మజీద్, ఒక చర్చి, ఒక దేవాలయం నిర్మించారని చెప్పారు. కేసీఆర్ సెక్యులర్ లీడర్ అనేదానికి ఇది ఒక నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలో ఒకసారి ఆలోచించాలన్నారు.

"కాంగ్రెస్ ఏం చేసిందని ఓటేయ్యాలి. ప్రజలు ఆదరించే వ్యక్తిని కొన్ని పార్టీలు ఏదో ఒక సాకుతో అణధరణకు గురి చేస్తారు. బీజేపీతో బీ టీమ్ అని మాపై నిందలు వేస్తారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్లు నడిస్తే వ్యతిరేకించే రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో బుల్డోజర్లను ఎందుకు వ్యతిరేకించడం లేదు. కేంద్రంలో సీబీఐని బీజేపీ తొత్తు అని రాహుల్ గాంధీ ఆరోపిస్తారు.. ఇక్కడి కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును ఎంక్వయిరీ చేయమని సీబీఐకి అప్పగిస్తుంది. వక్ఫ్ బిల్లును మొదటిసారిగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కోసం జీవో తెచ్చింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా వక్ఫ్ బిల్లును అమలు చేసేందుకు తొందర పడలేదు. ఇక్కడ ఒక మంత్రిపై ఈడీ దాడులు జరిగి సంవత్సరం అయినా ఎలాంటి చర్యలు లేవు. ఒక బీజేపీ ఎంపీకి ఇక్కడ రూ. 1350 కోట్ల రూపాయలతో కాంట్రాక్టు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైనా ఇప్పటికీ ఒక్క ముస్లిం వ్యక్తికి ప్రాతినిధ్యం లేదు.ముఖ్యమంత్రి అనుకుంటే ఒక ఎమ్మెల్సీ సీటు ముస్లింలకు కేటాయించి మంత్రి పదవి ఇవ్వచ్చు.. కానీ అలా చేయడం లేదు." అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఈసీ..
## బీఆర్ఎస్‌కి బిగ్ షాక్..

**న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రిజిస్టర్ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ గుర్తులు కేటాయించింది. రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులకు చపాతీ రోలర్, రోడ్ రోలర్ గుర్తుల కేటాయించారు. అంబేద్కర్ నేషనల్ పార్టీ అభ్యర్థి చేపూరి రాజుకి రోడ్ రోలర్, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీకి చెందిన అంబోజు బుద్ధయ్యకి చపాతీ రోలర్ గుర్తును కేటాయించారు. గతంలో ఈ సింబల్స్ తొలగించాలని ఎన్నికల కమిషన్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. కారు గుర్తుకు దగ్గరగా ఉన్న గుర్తుల కారణంగా ఓటర్లు సింబల్స్ గుర్తింపులో కన్ఫ్యూజ్ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఉప ఎన్నికల్లో బ్యాలెట్ యూనిట్ లో అభ్యర్థుల కలర్ ఫోటోలు ప్రింట్ చేయనుంది ఈసీ.. ఇది బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బగా భావిస్తున్నారు.

కాగా.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో ఇవాళ వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు.

## త్వరలో ఆ బీజేపీ ఎంపీ చిట్టా బయటపెడతా.. కవిత సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

. మరి ఇప్పుడు మీ ట్యాక్స్ నడుస్తోందా అర్వింద్ అంటూ కవిత ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని అర్వింద్ రాజీనామాతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ మైనారిటీ గవర్నమెంట్ నడుస్తోందని మీరు రాజీనామా చేస్తే బీసీ రిజర్వేషన్లు నడుచుకుంటూ వస్తున్నాయన్నారు. తాను జనం బాట యాత్ర ప్రారంభించగానే నాపై నా కుటుంబంపై ఓ బీజేపీ ఎంపీ లేని పోని ఆరోపణలు చేశారని త్వరలోనే ఆయన అవినీతి చిట్టా అంతా మీడియా ముఖంగా బయటపెడతానన్నారు.

కాంగ్రెస్ తో మాకు పనిలేదు:

కాంగ్రెస్ కే దిక్కులేదని నాకు ఏం సపోర్టు చేస్తారని విమర్శించారు. అనుకోకుండా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దాన్ని నిలుపుకోలేకపోతోందని ఆరోపించారు. కాంగ్రెస్ మునిగిపోయే పడవలాంటిదని దానితో మాకు పని లేదన్నారు.

## అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని చెత్తబుట్టలో పడేస్తాం: తేజస్వి యాదవ్

మొదటి పేజీ తరువాయి

కానీ నితీష్ కుమార్ ఎప్పుడూ అలాంటి శక్తులతోనే ఉన్నారు. ఆయన కారణంగానే ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. బీజేపీని భారత్ జలావ్ పార్టీ అని పిలవాలి" అని ఆయన అన్నారు. "ఈ ఎన్నికలు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సోదరభావాన్ని కాపాడటానికి జరుగుతున్న పోరాటం. 20 ఏళ్లుగా నితీష్ కుమార్ పాలనతో ప్రజలు విసుగు చెందారు. ప్రభుత్వంలోని ప్రతి శాఖలోనూ అవినీతి విపరీతంగా పెరిగిపోయింది, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయి" అని అన్నారు. నితీష్ కుమార్, నరేంద్ర మోడీలు సుదీర్ఘ కాలంగా పాలనలో ఉన్నప్పటికీ బీహార్ ఇప్పటికీ దేశంలో అత్యంత పేద, వెనుకబడిన రాష్ట్రంగా ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో మహాకూటమి ప్రభుత్వం ఏర్పడితే, సీమాంచల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం సీమాంచల్, ఇప్పుడు వారిని జవాబుదారీగా ఉంచాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు.

ఇదే సమయంలో శనివారం ఆర్జేడీ ఎమ్మెల్సీ మహ్మద్ ఖారీ సోహైబ్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. తేజస్వి యాదవ్ ముఖ్యమంత్రి అయితే, వక్ఫ్ బిల్లుతో సహా అన్ని బిల్లులను చింపి పారవేస్తారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్ని రేపాయి. ఆయన ఈ వ్యాఖ్యలు చేసిన తరువాతి రోజే ఏకంగా తేజస్వి యాదవ్ వక్ఫ్ బిల్లుపై వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశం అయ్యింది. అయితే.. ఒక ముఖ్యమంత్రి కేంద్ర చట్టాన్ని ఎలా రద్దు చేయగలరని బీజేపీ ప్రశ్నిస్తుంది. ఏప్రిల్‌లో పార్లమెంటు వక్ఫ్ (సవరణ) చట్టం, 2024ను ఆమోదించిన తర్వాత తాజాగా తేజస్వి యాదవ్ ఈ ప్రకటన చేశారు. అయితే ఎన్డిఏ ప్రభుత్వం దీనిని ముస్లిం సమాజం, వెనుకబడిన వర్గాలు, మహిళలకు అధికారం కల్పించే పారదర్శక చట్టంగా అభివర్ణించింది. కానీ ఈ చట్టం ముస్లింల మతపరమైన, ఆస్తి హక్కులను ఉల్లంఘిస్తుందని ప్రతిపక్షం వాదిస్తోంది.

## ప్రమాదాలపై టీజీఎస్ఆర్టీసీ అలర్ట్..
## బస్సుల్లో సైరన్, సేఫ్టీ ప్రికాషన్స్..

మొదటి పేజీ తరువాయి

అలాగే ఆ బస్సుల్లో ప్రయాణికులను అప్రమత్తం చేయుటకు సైరన్ పొందుపరిచినట్లు వెల్లడించింది. సూపర్ లగ్జరీ బస్సుల్లో ఫైర్ ఎక్స్టింగిషర్, బస్సు వెనుక భాగంలో కుడి వైపు అత్యవసర ద్వారం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపింది. డీలక్స్ ఎక్స్ ప్రెస్ పల్లె వెలుగు బస్సుల్లో కుడివైపు వెనుక భాగంలో అత్యవసర ద్వారం, ఫైర్ ఎక్స్టింగిషెర్ లు ఏర్పాటు చేసినట్లు వివరించింది. 'మీ ఆదరణ మాకు కొండంత అండ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. సుఖప్రదం' అంటూ శుభాకాంక్షలతో మీ టీజీఎస్ఆర్టీసీ అని ట్వీట్‌లో పేర్కొంది. కాగా, ఇటీవల కర్నూలులో కావేరి ట్రావెల్స్ బస్సులో అగ్నిప్రమాదం జరగడంతో అందులో 19 మంది సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఆర్టీసీ సేఫ్టీ ప్రికాషన్స్ వివరించినట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్ కు ఓటు..అసెంబ్లీలో రౌడీ లకు చోటు

### బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఓటువెయ్యండి

**జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్, బిఆర్ఎస్ సీనియర్ నేత గుండాల కృష్ణ**





**హైదరాబాద్ బ్యూరో, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేస్తే రౌడీ లను అసెంబ్లీ కి పంపినట్లవుతుందని, రౌడీ లు ప్రజలను పీడించడం తప్ప వారికి మంచి చేయరని మాజీ మంత్రి పువ్వాడ అజయ్, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ అన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల లో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం నియోజక వర్గం లోని పలు డివిజన్లలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని ప్రకటించి అధికారంలోకి రాగానే ఆ పథకాలను విస్మరించిందని ఆరోపించారు. మహిళకు 2500,పెంక్షన్ 4000, తులం బంగారం ఇస్తామని మభ్యపెట్టిందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి వారికి సైతం మొండి చేయి చూపించిదనీ విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన పథకాలు మాగంటి గోపినాథ్ చేసిన అభివృద్ధి ప్రజలకు వివరించారు.

## నవంబర్ 7న పెన్షనర్ల చలో హైదరాబాద్







**ఖమ్మం ఎడ్యుకేషన్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని దర్శిస్తూ నవంబర్ 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే కృష్ణయ్య ఎం సుబ్బయ్య తెలిపారు. ఆదివారం పెన్షనర్స్ భవన్లో రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన నగర కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024 మార్చి నుండి రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన పెన్షనరీ ప్రయోజనాలను చెల్లించకుండా కాలయాపన చేస్తూ పెన్షనర్లకు రావలసిన కరువు భత్యం డియర్ నెస్ అలవెన్స్ చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానాన్ని నిరసించారు. పెన్షనర్లకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించి ఆరోగ్య కార్డులను అన్ని ఆసుపత్రులలో ఉపయోగపడే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడుతూ పెన్షనర్లు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేనందున రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని పెన్షనర్లు నవంబర్ 7న పెద్ద ఎత్తున హైదరాబాదులో ప్రదర్శన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పెన్షనర్లందరూ పాల్గొనాలని తెలిపారు. అనంతరం ఖమ్మం నెహ్రూ నగర యూనిట్ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పి బసవరావు. రాయల వెంకటనారాయణ టి జనార్ధన్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాధాకృష్ణ కార్యదర్శిగా దొడ్డ రమేష్ అసోసియేట్ అధ్యక్షులుగా మల్లెల శంకర్రావు ఆర్థిక కార్యదర్శిగా భానోత్ వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులుగా బి కోటేశ్వరరావు. తుమ్మల రజిని. సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వై నరసింహారెడ్డి ప్రచార కార్యదర్శిగా రామస్వామి జిల్లా కౌన్సిలర్స్ గా కె రామ్మోహన్ రావు పి నాగార్జున ఎన్ వరలక్ష్మి. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ పూర్ణచందర్రావు కాజా మొయినుద్దీన్ . సి బాబురావు. ఉపేందర్ రావ్ డీకే శర్మ తదితరులు పాల్గొన్నారు.

# చేతివృత్తులకు చేయూతనిద్దాం

- స్వదేశీ వస్తువులే దేశాభివృద్ధికి మూలం
- చేనేత, వృత్తిదారుల ఉత్పత్తులు కొనడం దేశ సేవే
- బిజెపి జాతీయ నాయకులు, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల కో ఇన్చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి
- ఖమ్మం మేదర్ బజార్లో బిజెపి నేతల పర్యటన





**ఖమ్మం టౌన్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** స్థానిక చేతివృత్తిదారులను ఆదుకోవడం ద్వారా స్వదేశీ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని బిజెపి జాతీయ నాయకుడు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం నగరంలోని మేదర బజార్ ప్రాంతాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు తో కలసి సందర్శించి, చేతివృత్తిదారులు తయారు చేస్తున్న వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. స్థానిక కళాకారులు కనికరపు విజయలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు తయారు చేసిన వెదురు బుట్టలు, అలంకార వస్తువులను స్వయంగా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి అంటే కేవలం సాంకేతిక రంగం కాదు, ప్రతి వృత్తిదారుడి కృషి కూడా దేశ బలానికి మూలం.



మనం చేతివృత్తిదారులు తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేస్తే, వారికి ఆర్థిక చేయూత లభిస్తుంది. అంతేకాదు, దేశంలోని రూపాయి దేశంలోనే తిరుగుతుంది. ఇదే నిజమైన ఆత్మనిర్భర్ భారత్ మార్గం" అని తెలిపారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి భారతీయుడు స్వదేశీ వస్తువులనే వినియోగించాలి. ఇతర దేశాల ఉత్పత్తులపై ఆధారపడితే బంగ్లాదేశ్, నేపాల్, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్‌లలో కనిపిస్తున్న రాజకీయ ఆర్థిక అస్థిరత మన దేశాన్నీ తాకవచ్చు" అని హెచ్చరించారు. అదేవిధంగా ప్రపంచం అనిశ్చితి గుండా వెళుతున్న సమయంలో, మన వ్యాపారులు మన దుకాణాలు స్వదేశీ వస్తువులకు మాత్రమే' అని ప్రతిజ్ఞ చేయాలి. మన మార్కెట్‌లో అమ్మే ప్రతి వస్తువు భారతీయుని చెమటతో తయారవుతుందనే నమ్మకంతో ఉండాలి. ప్రతి పౌరుడు తనకుతానే ప్రశ్నించుకోవాలి – నేను కొన్న వస్తువు ఒక భారతీయుడు తయారు చేసిందా? ఆలోచన మారితేనే దేశం మారుతుంది" అని స్పష్టం చేశారు. చేనేత కార్మికులను కూడా ప్రస్తావిస్తూ, "చేనేత, మట్టి, వెదురు, దారాలు ఇవన్నీ మన దేశ ఆత్మను ప్రతిబింబించే చిహ్నాలు. పార్టీ కార్యకర్తలందరూ చేనేత వస్త్రాలు ధరించి, వాటి వినియోగాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి" అని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, కేంద్రం తీసుకుంటున్న ఆర్థిక సంస్కరణల దిశగా భారతదేశం ఇప్పటికే ప్రపంచంలో నాలుగో ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. త్వరలో మూడవ స్థానం కూడా సాధించగలమని నమ్మకం. అయితే, అది సాధ్యం కావాలంటే ప్రజలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు అందరూ 'స్వదేశీ' పట్ల కట్టుబడి ఉండాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి డి. వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శులు నల్లగట్టు ప్రవీణ్ కుమార్, నాయుడు రాఘవరావు, నాయకులు నున్న రవికుమార్, రంగా కిరణ్, గడిల నరేష్, పాలెపు రాము, ఏలూరి నాగేశ్వరరావు, రుద్ర ప్రదీప్, గుగ్గులోతు నాగేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

**పత్తి, వరి పంటలకు ప్రభుత్వం సీసీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

**సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి బండి రమేష్.**



**ఖమ్మం టౌన్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** గత కొంతకాలంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పత్తి, వరి, మిర్చి రైతులు నష్టపోయారని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు.స్థానిక సుందరయ్య భవనంలో నందిగామ కృష్ణ అధ్యక్షతన జరిగిన సిపిఎం పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా పత్తి, వరి, మిర్చి రైతులు నష్టపోయారని, నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వరి, పత్తి రైతుల దగ్గర కొనేందుకు వెంటనే ప్రభుత్వం సీసీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా వరి రైతుల దిగుబడి తగ్గిందని, పత్తి తేమతో సరైన ధర పలకటం లేదని, ఇప్పుడే వేస్తున్న వరి ఇప్పుడే వేస్తున్న వరి పత్తి వర్షాలకు మొలకెత్తకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో రైతుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు కార్యక్రమాలు రూపొందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు,పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, సుదర్శన్ రెడ్డి, నండ్ర ప్రసాద్, గొడవర్తి నాగేశ్వరరావు, మల్లెల స నుమంతరావు, కొమ్ము శ్రీను, మండల కార్యదర్శి తోటకూరి రాజు కె.వి.రెడ్డి, డివిజన్ నాయకులు బెల్లం లక్ష్మి, పెండ్యాల సుమతి, గంగాధర్,పగడి కత్తుల నాగేశ్వరరావు, ఎడవెల్లి రమనా రెడ్డి,వడ్లమూడి నాగేశ్వరరావు భూక్య నాగేశ్వరరావు, తుళ్లూరు నాగేశ్వరరావు, అంగిరేకుల నరసయ్య దాసరి మహేందర్, పే రుమల పల్లి పల్లి మోహన్ రావు, ప్రతాప్ నేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లు అమలుకై' బీసీ విద్యార్థుల దీక్ష'



**హైదరాబాద్, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు 'బీసీ స్టూడెంట్స్ జేఏసీ' కీలక ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఉద్యమాల గడ్డ అయిన ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నవంబర్ 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఐదు రోజుల పాటు 'బీసీ విద్యార్థి దీక్ష' నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రకటించింది. ?జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ దీక్షకు సంబంధించిన పోస్టర్లను జేఏసీ అధ్యక్షులు, సలహాదారులు డా. జంపాల రాజేష్, వలిగొండ నర్సింహులు ఆవిష్కరించారు.

ప్రధాన డిమాండ్: బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి!

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లును అమలు పరిచి, రాజ్యాంగ సవరణ ద్వారా దానిని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

అడ్డుపడితే ఉద్యమం ఉద్రిక్తం!

బీసీ రిజర్వేషన్ల విషయంలో అడ్డుపడుతున్న వ్యక్తులకు వారు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "మాకు రావాల్సిన వాటాను ఇవ్వకపోతే, భవిష్యత్తులో బీసీ ఉద్యమాన్ని మరింత ఉద్రిక్తం చేస్తాం. రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న 'దుష్ట ద్రోహుల' ఇళ్లు, కార్యాలయాలను ముట్టడించి, వారు బయటికి వెళ్లకుండా అడ్డుకుంటాం" అని బీసీ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

విజయవంతం చేయాలని పిలుపు:

ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా జరుగుతున్న ఈ విద్యార్థి దీక్షను విజయవంతం చేయాలని బీసీ మేధావులు, యువత, సబ్బండ వర్గాలు, అన్ని సామజిక విద్యార్థి సంఘాలు, బహుజన మేధావులు, బీసీ విద్యార్థి సంఘాల మద్దతుదారులను జేఏసీ కోరింది. ప్రతి ఒక్కరూ దీక్షలో కూర్చున్న విద్యార్థులకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు చేరాల వంశీ, సీనియర్ నాయకులు రంగసాయి బట్టు, మొలుగురి బచ్చయ్య, వైస్ చైర్మన్, వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు వెంకట్, మామిడాల రవి కుమార్, కోలా శేఖర్, వెంబటి అబిలాష్, అధికార ప్రతినిధులు కదారి రమేష్, నూకల మధు, ప్రణయ్ భాస్కర్, శ్రీధర్ యాదవ్, సంతోష్, లింగేష్, శివ, కార్తీక్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పాలన అస్తవ్యస్తం

- ఇది ప్రజల గోస వినిపించని ప్రభుత్వం
- ఇకనైనా కాంగ్రెస్ నాయకులు కళ్ళు తెరవాలి
- మంత్రుల మీద నియంత్రణ కోల్పోయిన ప్రభుత్వం
- ఖమ్మంలో కాంగ్రెస్ దాడుల సంస్కృతికి నాంది
- హామీల అమలుపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి
- మేం ఓట్లు చోరీ చేస్తే కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాదు
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఫైర్



**ఖమ్మం బ్యూరో, 26 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న అస్తవ్యస్త పాలనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్వస్తి చెప్పాలని బిజెపి జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో-ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో హితవు పలికారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇకనైనా కళ్లు తెరిచి, రాష్ట్ర ప్రజల 'గోస'పై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదివారం నాడు ఖమ్మంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలకుల తీరుపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పరిపాలన మంత్రాలను అదుపులో ఉంచుకోవాలని, ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు కేవలం కాంట్రాక్టు పనుల కోసమే పదవులు అనుభవిస్తున్నారని, ప్రజలను పట్టించుకోవడం లేదని సుధాకర్ రెడ్డి ఆరోపించారు. మంత్రులు అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కోర్టుల ఆదేశాలను సైతం లెక్కచేయకుండా రేవంత్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తోందని, ముఖ్యమంత్రికి మంత్రులపై అజమాయిషీ లేకపోవడం వారి పాలన తీరుకు నిదర్శనమని దుయ్యబట్టారు.

దాడుల సంస్కృతిపై మండిపాటు

తెలంగాణలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నాయకులు దాడుల సంస్కృతికి నాంది పలికారని పొంగులేటి సుధాకర్ రెడ్డి విమర్శించారు. సత్తుపల్లి పట్టణంలో బీసీ బంద్ సందర్భంగా బిజెపి కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాలు దాడులకు పాల్పడి ప్రశాంత వాతావరణాన్ని అల్లకల్లోలం సృష్టించారని ఆయన ఆరోపించారు. ఈ దాడిలో గాయపడిన సత్తుపల్లి మండల అధ్యక్షులు బానోతు విజయ్ ప్రస్తుతం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. పోలీసులు దోషులపై కేసులు నమోదు చేయకుండా, కక్షపూరితంగా బిజెపి నాయకులపైనే కేసులు పెట్టడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

హామీల అమలుపై శ్వేతపత్రం డిమాండ్

అధికారంలోకి వచ్చే ముందు ప్రజల్ని మభ్యపెట్టిన ఆరు గ్యారంటీల అమలు విషయంపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెబుతూ, అప్పులు చేస్తూ రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెడుతున్న సందర్భాలు నిత్యం చూస్తూనే ఉన్నామని అన్నారు. అలాగే, గత పదేళ్ల పనులకు పైసా కూడా మంజూరు చేయని రాష్ట్ర ప్రభుత్వం, కేవలం 10 నెలల కాలంలో చేసిన పనులకు మాత్రం వెంటనే బిల్లులు మంజూరు చేయడం ఆశ్చర్యకరంగా ఉందని ఆయన విమర్శించారు.

ఓట్ చోరీ ఆరోపణలు, అభివృద్ధి నిధులపై వివరణ

కాంగ్రెస్ నాయకులు చేస్తున్న 'ఓట్ చోరీ' ఆరోపణలను సుధాకర్ రెడ్డి తోసిపుచ్చారు. తాము ఓట్ చోరీ చేసి ఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది కాదని, బిజెపి అంటే నిబద్ధత అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం కేంద్రం రూ. 4,600 కోట్లు, నాగ్‌పూర్-అమరావతి జాతీయ రహదారి కోసం రూ. 26 వేల కోట్లు కేటాయిం చిందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఏమీ లేనప్పటికీ, స్థానిక నాయకులు ఆ నిధులు తమవే అని చెప్పుకోవడం అజ్ఞానం అన్నారు.

ఖమ్మం జిల్లా సమస్యలు

ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కూడా ప్రస్తావించారు. జిల్లాలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా పాడయ్యాయని చెప్పారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సరైన వైద్యం, మందులు లేకపోవడం, మున్నేరు రిటైనింగ్ వాల్ బాధితులకు పరిహారం అందకపోవడం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు, ఇసుక అక్రమ రవాణా, పంట నష్టపరిహారం, వరి బోనస్ బకాయిలు వంటి అనేక సమస్యలను ఆయన వివరించారు. సంక్షేమ హాస్టల్స్‌లో పారిశుధ్యం లోపించడం, ప్రభుత్వ హామీలైన రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి అమలు కాకపోవడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైరా కు చెందిన టీజేఏసీ వైరా మండల అధ్యక్షులు షేక్ పాషా బిజెపి పార్టీలో చేరగా పొంగులేటి సుధాకర్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

అంతకుముందు సుధాకర్ రెడ్డి నగరంలోని శ్రీ రక్ష హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బానోతు విజయని పరామర్శించారు, తర్వాత 57వ డివిజన్లోని కనమర్లపూడి ఉపేందర్ ఇంటి వద్ద మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, నాయకులు ఈవి రమేష్, నున్న రవికుమార్, దొంగల సత్యనారాయణ, రంగా కిరణ్గుత్తా వెంకటేశ్వరరావు, నంబూరి రామలింగేశ్వరరావు, నలగట్టు ప్రవీణ్ కుమార్, నాయుడు రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.



# మరో సినిమాకు పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్.. పాలిటిక్స్ చుట్టే కథ?



మూవీ న్యూస్ , 26 అక్టోబర్ (కెరటం న్యూస్): టాలీవుడ్ స్టార్ హీరో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రంగాల్లో కూడా దూసుకు వెళు తున్నారు. రాజకీయాల్లో కొనసాగుతూనే ఇటు ఛాన్స్ దొరికినప్పుడు సినిమాలు చేస్తున్నారు. సినిమాలు చేసి చాలా మందికి ఉపాధి కల్పిస్తున్నారు పవన్ కళ్యాణ్. అలాంటి పవన్ కళ్యాణ్ ఇటీవల %ా+% సినిమాతో బంపర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో బిజీగా ఉన్నాడట పవన్ కళ్యాణ్. ఈ సినిమా రిలీజ్ డేట్ ఇంకా ఫైనల్ కాలేదు.

త్వరలో దీనిపై క్లారిటీ రానుంది. అయితే అలాంటి పవన్ కళ్యాణ్ ఇప్పుడు మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ న్యూస్ వైరల్ గా మారింది. అది కూడా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో పొలిటికల్ డ్రామా నేపథ్యంలో వచ్చే సినిమాకు పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. ఈ సినిమాకు దిల్ రాజు నిర్మాతగా వ్యవహరించే ఛాన్స్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి దాదాపు **6** నెలలు పట్టే ఛాన్సులు ఉన్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో కూడా రాబోతుందట.

# కోట్లు తెచ్చిన సినిమాను ఫ్లాప్ అని ఎలా అంటారు.. 'కింగ్‌డమ్' పై నాగవంశీ షాకింగ్ కామెంట్స్




మూవీ న్యూస్ , 26 అక్టోబర్ (కెరటం న్యూస్): రౌడీ హీరో విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చిన మూవీ 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ అంచనాల మధ్య వచ్చి మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత నాగవంశీ ఈ చిత్రం వల్ల తనకు నష్టాలు రాలేదని వెల్లడించారు. "నా దృష్టిలో 'కింగ్‌డమ్' ఫ్లాప్ కాదు. అది విడుదలైనప్పుడు ఎందుకలా ప్రచారం చేశారో అర్థం కాలేదు. అమెరికాలో రూ. 28కోట్లు, నైజాంలో రూ. 12 కోట్లు వచ్చిన మూవీని ఫ్లాప్ అని ఎలా అంటారు. ఈ సినిమా నాకు ఎలాంటి నష్టాలు తీసుకురాలేదు. నా నుంచి కొన్న బయ్యర్లు కూడా సేఫ్. ఒక్కరిద్దరికి నష్టాలు వస్తే.. రిటర్న్ ఇచ్చాం. దీంతో అందరూ సేఫ్ జోన్‌లోకి వచ్చారు. నష్టాలు రానప్పుడు ఫ్లాప్ ఎలా అవుతుంది. అన్ని రకాలుగా 'కింగ్‌డమ్' మంచి హిట్ జోన్‌లనే ఉంది" అని అన్నారు. దీంతో ఈ కామెంట్స్ చూసిన వారంతా షాక్ అవుతున్నారు. ఫ్లాప్ సినిమాను హిట్ అంటున్నాడని ట్రోల్ చేస్తున్నారు.

